క్లుప్తంగా

నిత్యాన్నదాన భవన నిర్మాణానికి విరాళాలు

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీ, భూ సమేత వేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద నిర్మిస్తున్న నిత్యాన్నదాన భవన నిర్మాణానికి భక్తుల నుంచి భారీగా విరాళాలు అందుతున్నట్లు చైర్మన్ రుద్రరాజు రమేష్ రాజు, ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు. గణపవరానికి చెందిన వై.శివమల్లేశ్వరరావు-రామలక్ష్మీదుర్గా రూ.10,116, కాతేరుకు చెందిన పి.అనిల్‌కుమార్ రూ.10,116, ధవళేశ్వరానికి చెందిన కె.నాగేంద్రకుమార్-సునీత దంపతులు రూ.10,020, జగన్నాథపురానికి చెందిన ఎం.రామకృష్ణ-పద్మావతి రూ.10,002 విరాళంగా అందించినట్లు తెలిపారు. దాతలకు ఆలయ సిబ్బంది చేతుల మీదుగా స్వామి చిత్రపటం అందజేశారు.

రాజమహేంద్రవరం వెళ్లి పింఛన్ అందజేత



రాజమహేంద్రవరంలో అనంతలక్ష్మికి పింఛన్ ఇస్తున్న షాలిని

సఖినేటిపల్లి: అనారోగ్య రీత్యా రాజమహేంద్రవరంలో కుమార్తె వద్ద విశ్రాంతి తీసుకుంటున్న అంతర్వేది దేవస్థానంకు చెందిన భాస్కర్ల అనంతలక్ష్మికి, గ్రామ వలంటీర్ చొప్పల షాలిని బుధవారం పింఛన్ అందజేశారు. కాలుకు ఆపరేషన్ చేయించుకుని కుమార్తె వద్ద ఆమె ఉంటున్నారు. దీంతో వలంటీర్ షాలిని వెళ్లి ఆమెకు అక్కడ పింఛన్ అందజేశారు.

ఉచిత వైద్య శిబిరం

మలికిపురం: మలికిపురం మండలం లక్కవరం ఎంజీ గార్డెన్స్‌లో బుధవారం ఉచిత వైద్య శిబిరం జరిగింది. జనసేన ఉమ్మడిగోదావరి జిల్లాల ఇన్‌చార్జి కందు దుర్గేష్ శిబిరం ప్రారంభించారు. జీఎస్‌ఎల్ రాజానగరం వారి సౌజన్యంతో దివంగత మాజీ ఎమ్మెల్యే మంగెన గంగయ్య స్మారకార్థం స్థానిక మంగెన కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరంలో 18 విభాగాల డాక్టర్లతో పేదలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు, జనసేన నాయకులు బొంతు రాజేశ్వరరావు, ఎంపీపీ మేడిచర్ల వెంకట సత్యవాణి, గెడ్డం మహాలక్ష్మీ ప్రసాద్, ఆయా పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సీనియర్ న్యాయవాది 'బండారు'కు నివాళి



బండారు భాస్కరరావు (ఫైల్)

కొత్తపేట: ప్రముఖ సీనియర్ న్యాయవాది బండారు భాస్కరరావుకు స్థానిక న్యాయమూర్తులు, న్యాయవాదులు ఘనంగా నివాళులర్పించారు. ఇటీవల మృతి చెందిన న్యాయవాది భాస్కరరావు సంస్మరణ సభ బుధవారం స్థానిక కోర్టులో నిర్వహించారు. సీనియర్ సివిల్ జడ్జి కె.శైలజ, జూనియర్ సివిల్ జడ్జి ఎం.భాస్కరరావు తదితరులు భాస్కరరావు చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. వారితో పాటు, పలువురు న్యాయవాదులు మాట్లాడుతూ న్యాయవాదిగా, బార్ అసోసియేషన్ సభ్యుడిగా భాస్కరరావు సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఏపీపీ ఆనంద్, ప్రభుత్వ న్యాయవాదులు జి.విజయ, పడాల వెంకటరెడ్డి, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సత్యవాడ సందీప్‌కుమార్, న్యాయవాదులు పప్పుల వెంకటరామదొర, జి.పుల్లయ్యనాయుడు, పద్మాజీరావు, బండారు రామకృష్ణ, అల్లు భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

కేబుల్ ఆపరేటర్ల సమావేశం

ఆలమూరు: మండలంలోని పెదపళ్లలో బుధవారం మూడు నియోజకవర్గాల కేబుల్ ఆపరేటర్ల సంఘ సమావేశం జరిగింది. స్థానిక ఎస్‌బీపీబీకే సత్యనారాయణ కల్యాణ మండపంలో రాజమహేంద్రవరం రూరల్, మండపేట, కొత్తపేట నియోజకవర్గాల కేబుల్ ఆపరేటర్లు పాల్గొన్నారు. రాష్ట్ర మల్టీ సర్వీస్ కేబుల్ ఆపరేటర్ సంక్షేమ సంఘం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు కృష్ణారెడ్డి, జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు పసలపూడి సీతారామయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి పిఠాపురం నియోజకవర్గ పరిశీలకుడు చల్లా ప్రభాకరరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు నెక్కంటి వెంకట్రాయుడు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. మండలం కేబుల్ యూనియన్ నాయకులు మద్దిరెడ్డి మాణిక్యాలరావు, దియ్యన పెదకాపు, దాసరి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

జీపీఎస్‌ను రద్దు చేయాలి

మామిడికుదురు: ప్రభుత్వం అమలు చేయాలని నిర్ణయించిన జీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పింఛన్ విధానాన్ని అమలు చేయాలని మామిడికుదురులో బుధవారం జరిగిన ఎస్టీయూ మండల శాఖ సమావేశం డిమాండ్ చేసింది. మామిడికుదురులో మండల శాఖ అధ్యక్షుడు కొమ్ముల వీరరాఘవరావు అధ్యక్షతన సమావేశం జరిగింది. పెండింగ్‌లో ఉన్న డీఏలను, ఆర్జిత సెలవుల క్యాష్ బకాయిలను తక్షణం చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరింది. సమావేశంలో సంఘం ప్రతినిధులు కారుపల్లి కల్యాణ్‌బాబు, మట్టా నాగరాజు, బత్తుల రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యం

- జోరుగా జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు
- పాల్గొన్న ఎమ్మెల్యేలు జగ్గిరెడ్డి, చిట్టిబాబు, అధికారులు



వానపల్లిలో వైద్య సేవలు పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి



వాకలగరువులో బీపీ చెక్ చేయించుకుంటున్న ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు

అంబాజీపేట: ఆరోగ్యమే మహా భాగ్యమని రాష్ట్రాన్ని ఆరోగ్యాంధ్రప్రదేశ్‌గా తీర్చి దిద్దడమే లక్ష్యంగా సీఎం జగన్ పనిచేస్తున్నారని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. వాలకగరువులో ఎంపీడీఓ కె.సత్యనారాయణ పర్యవేక్షణలో సర్పంచ్ మద్దింశెట్టి దొరబాబు అధ్యక్షతన జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపును బుధవారం నిర్వహించారు. ఎమ్మెల్యే చిట్టిబాబు మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్షలో 14 రకాల వైద్య సేవలను అందిస్తున్నారని వాటిని ప్రతి రోగి సద్వినియోగం చేసుకోవాలన్నారు. సుమారు 380 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు దొమ్మేటి సత్యమోహన్, ఎంపీటీసీ వాకపల్లి దొరబాబు, పార్టీ మండల శాఖ అధ్యక్షుడు వాసంశెట్టి చినబాబు, కేతా రాజు, వాకపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తపేటలో..

కొత్తపేట: వైద్య, ఆరోగ్య రంగానికి అత్యధిక ప్రాధాన్యం ఇచ్చిన ఏకైక సీఎం జగన్‌మోహన్‌రెడ్డేనని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. మండలంలోని వానపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష ప్రత్యేక వైద్య శిబిరాన్ని జగ్గిరెడ్డి ప్రారంభించారు. సభలో ఎమ్మెల్యే జగ్గిరెడ్డి ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ సంపూర్ణ ఆరోగ్యం.. ఆనందకరమైన జీవితం లక్ష్యంగా సీఎం జగన్ ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని తీసుకువచ్చిందన్నారు. కార్యక్రమంలో అముడా చైర్మన్ గొల్లపల్లి డేవిడ్‌రాజు, ఎంపీపీ మార్గన గంగాధరరావు, జెడ్పీటీసీ గూడపాటి రమాదేవి, మండల పార్టీ అధ్యక్షుడు ముత్యాల వీరభద్రరావు, డీసీసీబీ పర్సన్ బండారు రాజా తదితరులు పాల్గొన్నారు.

ఈదరాడలో..

మామిడికుదురు: జగనన్న ఆరోగ్య సురక్ష పథకం ద్వారా ప్రజలకు ప్రభుత్వం నాణ్యమైన వైద్య సేవలందిస్తుందని జెడ్పీటీసీ సభ్యుడు కళారెడ్డి అంజిబాబు, ఎంపీపీ కుసుమ వనజకుమారి పేర్కొన్నారు. ఈదరాడ జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఎంపీపీ వనజకుమారి ప్రారంభించారు. జెడ్పీటీసీ, ఎంపీపీలు వైద్య పరీక్షలు చేయించుకున్నారు. పరీక్షలు చేయించుకున్న వారికి మందులు అందజేశారు. జగనన్న ఆరోగ్య సురక్ష పథకం ద్వారా ప్రజలకు ఉచితంగా వైద్య సేవలందించడం ముదావహమన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ చుట్టుగుళ్ల లక్ష్మి, ఎంపీడీఓ కె.వెంకటేశ్వరరావు, తహసీల్దార్ రియాజ్ హుస్సేన్, పీఏసీఎస్ చైర్మన్ బొలిశెట్టి భగవాన్, వక్ఫ్ బోర్డు డైరెక్టర్ ఎండీవై షరీఫ్, పార్టీ నేతలు పాల్గొన్నారు.

ఆత్రేయపురంలో..

ఆత్రేయపురం: ప్రతి ఒక్కరూ జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వైద్యాధికారి ఎం.దుర్గారావు దొర అన్నారు. మండలంలోని ఉచ్చిలిలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఆయన పరిశీలించారు. మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ కనుమూరి శ్రీనివాసరాజు, ఉచ్చిలి సర్పంచ్ ఉర్రింకల మీరమ్మ, సొసైటీ అధ్యక్షుడు బచ్చు శివప్రసాద్, తహసీల్దారు డీవీఎస్ అనిల్‌కుమార్, వైద్యాధికారుల ఆధ్వర్యంలో ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం తరఫున మెరుగైన ఉచిత వైద్యం అందించాలనే సంకల్పంతో కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

రావులపాలెంలో..

రావులపాలెం: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి దుర్గారావు దొర, కొత్తపేట ఆర్డీవో ముక్కంటి అన్నారు. బుధవారం రావులపాలెం సచివాలయం-3 పరిధిలో చాంబర్ ఆఫ్ కామర్స్‌లో నిర్వహించి శిబిరాన్ని వారు సందర్శించారు. 506 మందికి వైద్య సేవలు అందించినట్టు ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్ తెలిపారు.

పి.గన్నవరంలో..

పి.గన్నవరం: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలతో ప్రజలకు ఎంతో మేలు జరుగుతున్నదని తహసీల్దార్ జి.రవీంద్రనాథ్ ఠాగూర్ అన్నారు. ఊడిమూడి-2 గ్రామ సచివాలయం వద్ద బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం జరిగింది. సర్పంచ్ నూకపెయ్యి ప్రసన్నకుమార్ అధ్యక్షత జరిగిన సమావేశంలో ఠాగూర్ మాట్లాడారు. నాగుల్లంక పీహెచ్‌సీ వైద్యాధికారి కె.సుబ్బరాజు, వైద్య నిపుణులు 233 మందికి వైద్య సేవలు అందించారు. ఈసందర్భంగా గర్భిణులకు సీమంతం చేశారు. ఎంపీడీఓ ఎం.భారతి, నాయకులు సాధనాల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అయినవిల్లిలో..

అయినవిల్లి: మండలంలోని నల్లచెరువులో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని బుధవారం స్థానిక ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు ప్రారంభించారు. కార్యక్రమంలో 406 మంది రోగులు వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఏడుగురికి కళ్ల జోళ్లను ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ తాడి శ్రీవెంకటాచార్య, జెడ్పీటీసీ గన్నవరపు శ్రీనివాసరావు, వైద్యులు మంగాదేవి, సర్పంచ్‌లు గుండుమోగుల వెంకటేశ్వరరావు, శీలం వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తాటిపాకలో..

రాజోలు: తాటిపాక-1 గ్రామ సచివాలయం పరిధిలో బుధవారం స్థానిక ఉన్నత పాఠశాల ఆవరణలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యాధికారులు ఫణికిరణ్, మానస సుప్రియ, ఎస్.దివ్యదర్శిని, టి.మణికుమార్‌ల ఆధ్వర్యంలో రోగులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. సుమారు 350 మంది రోగులకు మందులు పంపిణీ చేశారు. ఎంపీడీఓ ఎస్.బాలాజీ, సర్పంచ్ కోటిపల్లి రత్నమాల, పంచాయతీ కార్యదర్శి పల్లి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



రావులపాలెంలో సురక్ష క్యాంపును సందర్శించిన దుర్గారావు దొర, ముక్కంటి



ఊడిమూడి సురక్ష శిబిరంలో వైద్య సేవలు అందిస్తున్న దృశ్యం



నల్లచెరువులో సురక్ష శిబిరానికి హాజరైన ప్రజలు

అభివృద్ధి, సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శం



వానపల్లి పీహెచ్‌సీ వద్ద శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

కొత్తపేట: రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమ పథకాల అమలులో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం యావత్ దేశానికే ఆదర్శంగా నిలిచిందని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. వానపల్లి పీహెచ్‌సీ ఆవరణలో 15 వ ఆర్థిక సంఘం నిధులు రూ.50 లక్షలతో నిర్మించే బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్ భవన నిర్మాణానికి, మండల పరిషత్ నిధులు సుమారు రూ.5 లక్షలతో నిర్మించే ఆర్చ్‌గేటు నిర్మాణానికి ఎమ్మెల్యే జగ్గిరెడ్డి శంకుస్థాపన చేశారు. జెడ్పీ నిధులు రూ.10 లక్షలతో నిర్మించిన గ్రావెల్ రోడ్డును జగ్గిరెడ్డి ప్రారంభించారు. జగ్గిరెడ్డి మాట్లాడుతూ పేద, మధ్యతరగతి ప్రజల ఆరోగ్య పరీక్షలకు సంబంధించి రూపాయి ఖర్చు లేకుండా పీహెచ్‌సీల్లో అన్ని యూనిట్లు ఏర్పాటు చేస్తుందన్నారు. దానిలో భాగంగా వానపల్లి, ఆత్రేయపురం పీహెచ్‌సీలకు రూ.16 లక్షల చొప్పున వ్యయంతో 2 నాట్ యూనిట్ మెషీన్లు మంజూరు చేసిందన్నారు. ఆయా పీహెచ్‌సీలకు బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్ భవనాలకు రూ.కోటి విడుదల చేసిందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో బాలల క్రీడలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం సరఫరా చేసిన కిట్లను జగ్గిరెడ్డి పంపిణీ చేశారు.

గడప గడపకు మన ప్రభుత్వం

గ్రామంలోని పలు శివారు గ్రామాల్లో ఎమ్మెల్యే జగ్గిరెడ్డి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంట్లో సభ్యులకు ప్రభుత్వం చేకూర్చిన లబ్ధిని వారికి వివరిస్తూ బుక్‌లెట్‌ను అందజేశారు. ప్రతిగా లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపుతూ మీకు, సీఎం జగన్‌కి రుణపడి ఉంటామని, మళ్లీ మనందరి ప్రభుత్వమే అధికారం చేపట్టాలని కోరుకుంటున్నామన్నారు. కార్యక్రమాల్లో ఆర్డీవో ఎం.ముక్కంటి, అముడా చైర్మన్ గొల్లపల్లి డేవిడ్‌రాజు, ఎంపీపీ మార్గన గంగాధరరావు, జెడ్పీటీసీ గూడపాటి రమాదేవి, డీసీసీబీ పర్సన్ బండారు రాజా, వానపల్లి దేవస్థానం చైర్మన్ కామిశెట్టి అమ్మన్న, గ్రామ పార్టీ అధ్యక్షుడు గొల్లపల్లి శ్రీనివాసరావు, సర్పంచ్‌లు సర్పంచ్ రెడ్డి చంటి, నెల్లి లక్ష్మీపతిరావు, ఏఎంసీ డైరెక్టర్ సాకా జానకి రామరాజు తదితరులు పాల్గొన్నారు.

గడప గడపకూ నిధులతో సమస్యల పరిష్కారం



అప్పనపల్లిలో సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

మామిడికుదురు: గడప గడపకు నిధులతో గ్రామాల్లో అపరిష్కృతంగా ఉన్న పలు సమస్యలు పరిష్కారానికి నోచుకుంటున్నాయని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు పేర్కొన్నారు. గడప గడపకు నిధులు రూ.40 లక్షలతో అప్పనపల్లిలో నిర్మించనున్న ఏడు సిమెంట్ కాంక్రీట్ రోడ్లకు ఎమ్మెల్యే బుధవారం శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ గడప గడపకు కార్యక్రమం ద్వారా ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నామన్నారు. ప్రజల నుంచి వచ్చిన సమస్యల పరిష్కారం దిశగా నిధులు మంజూరు చేశామని చెప్పారు. ప్రధానంగా రోడ్లు, విద్యుత్ సమస్యల పరిష్కారానికి నిధులు కేటాయించామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గెద్దం మంగాలక్ష్మి, ఎంపీటీసీ బొంతు నీలిమ, పీఏసీఎస్ చైర్మన్ గెద్దం కృష్ణమూర్తి, దేవస్థానం మాజీ చైర్మన్ పిచ్చుక చిన్న, ఎంపీటీసీల సమాఖ్య అధ్యక్షుడు నెల్లి దుర్గాప్రసాద్, తులా గోపాలకృష్ణ, జేసీఎస్ కన్వీనర్ జక్కంపూడి వాసు, బత్తుల జనార్దనరావు, ట్రస్టీలు గూటం శ్రీను, చిట్టాల సత్తిబాబు పాల్గొన్నారు.

సీఎం జగన్‌కు కృతజ్ఞతలు

రావులపాలెం: ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం డ్వాక్రా మహిళలను బేషరతుగా రుణ విముక్తి చేసిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. బుధవారం గోపాలపురంలోని ఎమ్మెల్యే స్వగృహం వద్ద జరిగిన కార్యక్రమంలో ఆలమూరు మండలానికి చెందిన వివిధ డ్వాక్రా సంఘాల మహిళలు ఎమ్మెల్యే జగ్గిరెడ్డిని కలసి సీఎం జగన్‌కి వారి కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే జగ్గిరెడ్డిని దుశ్శాలువ, పూలమాలలతో సత్కరించి అభినందనలు తెలిపారు. మూడు సంవత్సరాలుగా తమ గ్రూపులకు రుణమాఫీ జరగలేదని మూడు సంవత్సరాల మొత్తం కలిపి ఒకేసారి ఇప్పుడు జమ అయిందని ఆనందం వ్యక్తం చేశారు. ఈ సమస్యను సీఎం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించిన ఎమ్మెల్యే జగ్గిరెడ్డికి తాము ఎప్పుడూ అండగా ఉంటామని డ్వాక్రా మహిళలు తెలిపారు. జగ్గిరెడ్డి మాట్లాడుతూ సాంకేతిక లోపాల వల్ల కోనసీమ జిల్లాలో 135 గ్రూపులు కొత్తపేట నియోజకవర్గంలో 65 గ్రూపులకు రుణమాఫీ జరగలేదని ఈ విషయాన్ని సీఎం జగన్ దృష్టికి తీసుకువెళ్లగా ఆయన ప్రత్యేకశ్రద్ధ తీసుకుని రూ.45 కోట్లు నిధులు మంజూరు చేశారని దీంతో మూడు సంవత్సరాలుగా పడని మొత్తం ఒకేసారి ఆయా గ్రూపులకు పడిందన్నారు. ఈ విషయంపై వెంటనే స్పందించిన సీఎంకు తన తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్టు జగ్గిరెడ్డి అన్నారు.

గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి



గోపాలపురంలో గర్భిణులకు సామూహిక సీమంతాలు చేస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి-లావణ్య దంపతులు

రావులపాలెం: గర్భిణుల ఆరోగ్యంపై సీఎం జగన్ ప్రభుత్వం ప్రత్యేకశ్రద్ధ తీసుకుంటుందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. గోపాలపురంలోని ఎమ్మెల్యే స్వగృహం వద్ద బుధవారం నియోజకవర్గ స్థాయి గర్భిణులకు సీమంతాల కార్యక్రమాన్ని ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి జరిపించారు. సుమారు 200 మంది గర్భిణులకు సామూహిక సీమంతాలను జరిపించారు. ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి-లావణ్య దంపతులు గర్భిణులకు సాంప్రదాయబద్ధంగా చీర, రవిక, పసుపు-కుంకుమ, గాజులు, స్వీట్లు, పండ్లతో కూడిన కిట్లను వారికి అందచేశారు. జగ్గిరెడ్డి మాట్లాడుతూ మహిళలు రక్తహీనతతో ఇబ్బంది పడకూడదని, మహిళలు పౌష్టికాహార లోపాలతో ఇబ్బందులు పడకూడదన్న దృఢ సంకల్పంతో సీఎం జగన్ ప్రభుత్వం వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను అందిస్తుందన్నారు. అనంతరం మాతా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పోషకాహార ప్రదర్శనను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీపీ కర్రి లక్ష్మీవెంకట నాగదేవి, జెడ్పీటీసీ కుడుపూడి శ్రీనివాసరావు, సర్పంచులు సబ్బితి మోహనరావు, అంబటి సుబ్బలక్ష్మి, దొమ్మేటి అర్జునరావు, బొక్కా కరుణాకరం, పార్టీ నాయకుడు చిర్ల రామచంద్రారెడ్డి, ఐసీడీఎస్ సీడీపీఓ పి.శారద, గోపాలపురం సెక్టార్ సూపర్‌వైజర్ షేక్ పాతిమాబీబీ, అంగన్‌వాడీ కార్యకర్తలు హాజరయ్యారు.

ఆర్థిక తోడ్పాటుతో గ్రామీణాభివృద్ధికి శ్రీకారం



పొన్నమండలో మహిళకు బ్రోచర్ అందిస్తున్న ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు

రాజోలు: గ్రామాల్లో అన్ని వర్గాలకు ఆర్థిక తోడ్పాటు అందించడంతో గ్రామీణాభివృద్ధికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. బుధవారం పొన్నమండలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ద్వారా కుటుంబాలకు మంజూరైన సంక్షేమ పథకాలను తెలియజేస్తూ లబ్ధిదారుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ప్రజల నుంచి వచ్చిన వినతులను స్వీకరించి తక్షణం పరిష్కారమయ్యే సమస్యలను వెంటనే అధికారులతో మాట్లాడి పరిష్కరించారు. ఎమ్మెల్యే రాపాక మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వం జవాబుదారీగా ఉండాలన్నదే సీఎం జగన్ ఉద్దేశమన్నారు. ప్రజాధనం ప్రజా సంక్షేమానికి వినియోగించాలని, ఆ దిశగా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. మహిళలకు, బడుగు, బలహీన వర్గాలకు ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ఆర్థిక చేయూతను అందిస్తున్నామన్నారు. మాజీ ఎంపీపీ చేకూరి శింగరాజు, సర్పంచ్ కుక్కల బేబికుమారి, సొసైటీ చైర్మన్ కడలి సత్యనారాయణ, నాయకులు చిట్టూరి వేణు, చేకూరి చంటి రాజు, గెద్దం బుల్లిబ్బాయి, చెల్లింగి రాజబాబు, స్టాలిన్, గుబ్బల సత్తిబాబు, కుక్కల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

జంతు సంరక్షకుడికి సన్మానం



వేదికపై లక్ష్మీనారాయణను సన్మానిస్తున్న అధ్యాపకులు

మలికిపురం: స్థానిక ఎంవీఎన్‌జేఎస్ అండ్ ఆర్వీఆర్ ప్రభుత్వ ఎయిడెడ్ డిగ్రీ కళాశాలలో బుధవారం జంతు విభాగం ఆధ్వర్యంల్లో ప్రపంచ జంతు సంరక్షణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ దినోత్సవాన్నిపురస్కరించుకుని కేశనపల్లికి చెందిన జంతు సంరక్షకుడు అడబాల లక్ష్మీనారాయణను వేదికపై సాన్మనించారు. లక్ష్మీనారాయణ అనేక జంతువులను పోషిస్తూ, సంరక్షిస్తూ జంతు ప్రేమికుడిగా మన్ననలు అందుకుంటున్నారని ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ ఆనందమహాని పేర్కొన్నారు. లక్ష్మీనారాయణ పోషించిన ఎద్దులు గత 15 సంవత్సరాలుగా అనేక పోటీల్లో విజేతలుగా నిలిచాయన్నారు. 2023 పుంగనూరు గిత్తల పోటీల్లో రాష్ట్ర స్థాయిలో ద్వితీయ బహుమతి గెలుచుకున్న లోబ్ము నారాయణ వేదికపై మాట్లాడుతూ దేశానికి రైతు వెన్నెముక అయితే రైతుకి పశువులు అత్యంత ప్రీతిపాత్రమైనవని తన అనుభవాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో జంతు శాస్త్ర విభాగాధిపతి నిశ్చలాదేవి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు నక్కా రమేష్‌బాబు, విజయ్‌కుమార్, ఈ.శ్రీనివాస్, రాహేల్ బాబు, పి.సూర్యనారాయణరాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎలక్ట్రికల్ యూనియన్ ఉపాధ్యక్షుడిగా 'చాగంటి'



జిల్లా యూనియన్‌కు ఎన్నికైన ప్రతినిధులు

రాజోలు: జిల్లా ఎలక్ట్రికల్, ప్లంబింగ్, రీవైండింగ్ వర్కర్స్ యూనియన్ ఉపాధ్యక్షుడిగా శివకోడు గ్రామానికి చెందిన చాగంటి బాబులు ఎన్నికయ్యారు. నూతనంగా ఏర్పాటు చేసిన యూనియన్‌కు బత్తుల జనార్దన్, సుందర రెడ్డినాయుడు ముఖ్య సలహాదారులుగా తాటిపాకకు చెందిన మామిడిశెట్టి చిన్నా జిల్లా కార్యవర్గ సభ్యులుగా వ్యవహరిస్తారని బాబులు వివరించారు. నూతన జిల్లా కమిటీలో నియమితులైన నాయకులను యూనియన్ సభ్యులు అభినందించారు.

శ్రీమద్భాగవతం.. మోక్షమార్గం



అంబాజీపేటలో ప్రవచనాలు చెబుతున్న శ్రీనివాస రామనుజదాసు

అంబాజీపేట: మానవ జీవితానికి మోక్షమార్గం శ్రీమద్భాగతం వల్లే సిద్ధిస్తుందని నంబూరు చంద్ర కాశీప్రసాద మాతాజీ, కాశీ వన ఆశ్రమానికి చెందిన శ్రీనివాస రామనుజ దాసు భక్తులకు ఉద్బోధించారు. అంబాజీపేట పెద్ద వీధిలో ఉన్న ఏవీఆర్ గ్రాండ్ ఏసీ కల్యాణ మండపంలో బుధవారం శ్రీమద్భాగవత ప్రవచనాలు ప్రారంభమయ్యాయి. రామానుజ దాసు మాట్లాడుతూ మానవ జీవన వికాసానికి రామాయణ, మహాభారతాలతో పాటు భాగవతం ఎంతో ముఖ్యమన్నారు. రామాయణం ధర్మాన్ని, ఆచరింపదగిన విధానాలను నిర్దేశించిందని మానవ జీవన విధానాన్ని మహాభారతం వివరించిందన్నారు. అయితే శ్రీమద్భావతం మానవునికి మోక్షమార్గాన్ని సూచిస్తోందన్నారు. మానవ జీవితం, దేహం, అశాశ్వతమైనవని, ఐహిక సుఖాల కోసం వెంపర్లాడక భగవధ్యానంలో గడపాలన్నారు. మానవ జీవితానికి పారమార్థికమైన మోక్షమార్గం సాధించడానికి శ్రీమద్భావతం దోహదం చేస్తుందన్నారు. ఇతిహాసాల ప్రకారం భాగవతాన్ని తొలిసారిగా బ్రహ్మ దేవుడు నారదునికి, నారదుడు వ్యాసునికి, వ్యాసుడు శుకునికి, శుకుడు పరీక్షిత్తు మహారాజుకు బోధించారని రామానుజ దాసు వివరించారు. అయితే కలికాలంలో ప్రజలు ఐహిక సుఖాల కోసం పరితపిస్తూ, తుచ్ఛమైన జీవనాన్ని గడుపుతున్నారని, భగవన్నామస్మరణ చేయటం లేదన్నారు. కలియుగంలో భగధ్యానం వల్లే మానవుడికి మోక్షమార్గం కలుగుతుందని ఇందుకు భాగవతం ఎంతగానో దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు అప్పన రవికుమార్, రేవతి దంపతులతో పాటు అప్పన ప్రభాకర రావు, వాసు, బాలాజీ అధిక సంఖ్యలో మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

చిన్నారులకు టీకాలు తప్పనిసరి



ఆలమూరులో చిన్నారులకు టీకాలు అందజేస్తున్న వైద్యారోగ్య సిబ్బంది

ఆలమూరు: చిన్నారులకు నిర్ణీత సమయంలో విధిగా టీకాలు వేయించాలని చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు డి.మల్లికార్జున, పి.భవానీశంకర్ అన్నారు. ఆయా పీహెచ్‌సీల పరిధిలోని సబ్ సెంటర్లతో పాటు ఆలమూరు ప్రభుత్వ ఆస్పత్రిలో హెల్త్ సిబ్బంది బుధవారం చిన్నారులకు టీకాలను అందజేశారు. సీహెచ్‌ఓ పి.రాధాకృష్ణ, కె.జ్యోతికుమార్ హెల్త్ ఎడ్యుకేటర్ ఏవీవీ రాజా, ఎంపీహెచ్‌ఈఓ బి.సూర్యనారాయణ, సూపర్‌వైజర్లు ఎం.శ్రీనివాసరావు, పి.శివప్రసాద్, పి.ఉమ, ఆర్ బాలమణి తదితరులు వైద్యసేవలను పర్యవేక్షించారు. పినపళ్ల, చింతలూరు, పెనికేరు, చొప్పెల్ల, చెముడులంక, మడికి, గుమ్మిలేరు, నర్సిపూడి గ్రామాల్లో చిన్నారులకు టీకాలు, బాలింతలకు, గర్భిణులకు ఇంజక్షన్లను అందజేశారు. పలు వ్యాధుల నివారణకు వ్యాక్సిన్లు వేశారు.

సీఐటీయూ మహాసభలను విజయవంతం చేయండి

ఆలమూరు: జిల్లా ఏర్పడిన అనంతరం తొలిసారిగా మండపేటలో ఈనెల 11, 12 తేదీల్లో నిర్వహించనున్న సీఐటీయూ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని జిల్లా కార్యదర్శి కృష్ణవేణి కోరారు. ఆలమూరులో నిర్వహించిన అంగన్‌వాడీ కార్యకర్తల సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మహాసభల విజయవంతానికి తీసుకోవలసిన చర్యలపై చర్చించారు. మండల అంగన్‌వాడీ సంఘ నాయకులు డి.మణి, ఎస్.ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నేడు ర్యాలిలో ఎమ్మెల్యే పర్యటన

ఆత్రేయపురం: మండలంలోని ర్యాలి గ్రామంలో గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి పర్యటిస్తారని మండల పార్టీ కన్వీనర్ కనుమూరి శ్రీనివాసరాజు తెలిపారు. ఉదయం పీహెచ్‌సీలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవాలు చేపడతారన్నారు.